సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 16 । నవంబర్ । 2023



పాతకక్షతోనే ఆర్టీసీ డ్రైవరు హత్య

పాత కక్ష మనసులో పెట్టుకుని పక్కా పథకం ప్రకారం ఆర్టీసీ డ్రైవరు సాలి రవి(52)ని హత్య చేశారని పోలీసులు తెలిపారు. -8లో



వాహనంలో మంటలు

అంగళ్లులోని టి. అనితకు చెందిన ఐషర్ వాహనం నాగ్‌పూర్– హైదరాబాదు హైవేపై బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి పోయింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 384 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	490
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 626.240 కిలోలు

న్యూస్‌రీల్

పంచారామ శైవక్షేత్ర దర్శనికి ప్రత్యేక బస్సులు



మదనపల్లె సిటీ: కార్తీక మాసం పురస్కరించుకుని పంచారామ శైవక్షేత్ర దర్శనికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఈనెల 19, 25, వచ్చే నెల 3న మదనపల్లెలో బయలుదేరి యాగంటి, మహానంది, శ్రీశైలం, పుష్పగిరి, రాయచోటి వీరభద్రస్వామి ఆలయాల దర్శన ఉంటుందని పేర్కొన్నారు. అల్ట్రా డీలక్స్ పుష్‌బ్యాక్ సీట్స్, టీవీ సౌకర్యం కలదన్నారు. రానుపోను టిక్కెట్టు రూ.2000 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలని సూచించారు.

రుణ లక్ష్యాలు అధిగమించాలి

రాయచోటి: జిల్లా ఆర్థిక ప్రగతికి విరివిగా రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన బ్యాంక్లతో డీసీసీ డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి బ్యాంకుల అర్థ సంవత్సరం ప్రగతిపై లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పి వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రుణాలు మంజూరులో బ్యాంకర్లు తమ లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలన్నారు. సమావేశంలో ఎస్‌బీఐ, యూనియన్, ఏపీజీబీ, సప్తగిరి బ్యాంక్ ఆర్‌ఎంలు శర్మ, భాస్కర్, సుకాంత్ కుమార్, ప్రసాద్, వివిధ బ్యాంకర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో క్రీడల పోటీలు

వైవీయూ: ఈ నెల 24, 25వ తేదీల్లో ప్రొద్దుటూరు పట్టణంలోని రాయలసీమ వ్యాయామ విద్య కళాశాలలో యోగి వేమన విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడల పోటీలు నిర్వహించనున్నట్లు వైవీయూ క్రీడా బోర్డు కార్యదర్శి డా.కె.రామసుబ్బారెడ్డి తెలిపారు. అథ్లెటిక్స్, లాన్ టెన్నిస్, బ్యాడ్మింటన్ క్రీడల్లో పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు, నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాజరయ్యే క్రీడాకారులు కళాశాల ప్రిన్సిపల్ లేదా పీడీతో సంతకం చేసినటువంటి అర్హతా పత్రం, స్టడీ సర్టిఫికెట్, పది మార్కుల జాబితా నకలు తీసుకురావాలని కోరారు. 17 నుంచి 25 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలన్నారు. పూర్తి వివరాలకు, ఎంట్రీల నమోదుకు 9059130660, 9290088136 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వెండి మకర తోరణం అందజేత

పులివెందుల టౌన్: పులివెందులలోని మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారికి అలంకరించేందుకు రూ.1.30 లక్షల విలువ చేసే వెండి మకర తోరణాన్ని నొస్సం వెంకటరామసుబ్బారెడ్డి, వరలక్ష్మి దంపతులు బుధవారం విరాళంగా అందజేశారు. ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా వారిచే ప్రత్యేక పూజలు చేయించి పూలమాలలతో ఈవో సత్కరించారు.

నూతన నియామకం



జాకీర్‌హుసేన్

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్ర ప్రదేశ్ ముస్లిం సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన షేక్ మహమ్మద్ జాకీర్‌హుసేన్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ జియావుల్ హక్ నియామక పత్రం పంపారు. జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ముస్లిం సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

కడప కార్పొరేషన్: గిరిజన, ఆదివాసీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని సహాయ గిరిజన సంక్షేమాధికారి నాగభూషణం అన్నారు. జన జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా చిన్నచౌక్ గిరిజన గురుకుల పాఠశాలలో బుధవారం ఉత్సవాలు నిర్వహించారు. దేశ నాయకుల ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పాఠశాల ప్రిన్సిపల్ పి.విజయలక్ష్మి, బి.వేణు గోపాల్ నాయక్, డా.శివానాయక్, నాగన్న, ఎం.శివార్జున, ఆర్‌వీ.రమణ పాల్గొన్నారు.

వల్లూరులో కేంద్ర బృందం

వల్లూరు: వల్లూరులో కేంద్ర బృందం సభ్యులు అభిషేక్, రోహిత్ కుమార్, భరత్ , రోహిత్, బ్రిజేష్, సతీష్ బుధవారం పర్యటించారు. స్థానిక గ్రామ సచివాలయాన్ని సందర్శించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు తెలుసుకున్నారు. సచివాలయం ఆవరణలో ఇంకుడు గుంత, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆర్బీకే సందర్శించి రైతులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. డీఎల్‌పీవోలు మస్తాన్ వలి, రమణారెడ్డి, సురేష్ కుమార్, రామమూర్తి పాల్గొన్నారు.

అందరం ఆడుదాం.. రండి

ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా 'ఆడుదాం ఆంధ్రా' (ఇది అందరి ఆట) పేరుతో క్రీడా సంబరాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. డిసెంబర్ 15వ తేదీ నుంచి 2024 జనవరి 26వ తేదీ వరకు నిర్వహించే ఈ మెగా క్రీడా టోర్నీకి జిల్లాలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 20న ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుండగా, 21 నుంచి సచివాలయాలకు క్రీడా సామగ్రి పంపిణీ చేయనున్నారు. 15 సంవత్సరాలు పైబడిన వారందరూ పాల్గొనే ఈ క్రీడా సంబరంలో ప్రధానంగా క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖోలు నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడల్లో పోటీలు నిర్వహించుకునే అవకాశం కల్పించారు.

- సచివాలయాల పరిధిలో ఐదు క్రీడల పోటీలు
- 20 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం
- డిసెంబర్ 15వ తేదీ నుంచి పోటీలు ప్రారంభం

సచివాలయ స్థాయిలో విజేతలుగా నిలిచే క్రీడాకారుల సంఖ్య..

క్రీడ పేరు	పురుషుల జట్టు	మహిళల జట్టు	మొత్తం
క్రికెట్	16	16	32
బ్యాడ్మింటన్	02	02	04
వాలీబాల్	12	12	24
కబడ్డీ	12	12	24
ఖోఖో	15	15	30



వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు (ఫైల్) (ఇన్‌సెట్) ఆడుదాం ఆంధ్రా లోగో

కడప స్పోర్ట్స్: వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 'ఆడుదాం ఆంధ్రా' మెగా క్రీడా టోర్నీ నిర్వహణకు కార్యాచరణ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఈ నెల 14వ తేదీ నుంచి గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలోని వాలంటీర్లకు శాప్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించేలా మార్గనిర్దేశం చేశారు.

ఐదు క్రీడల్లో పోటీలు

వైఎస్‌ఆర్ కడప జిల్లాలోని 645, అన్నమయ్య జిల్లాలోని 501 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో 1,30,644 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ క్రీడాంశాల్లో ఒక్కో క్రీడకు రెండు పురుషులు, రెండు మహిళల జట్లు పాల్గొనేలా చూడాలని అధికారులు దిశానిర్దేశం చేశారు. ఈ లెక్కన ఐదు క్రీడలకు ప్రతి సచివాలయం పరిధిలో 20 జట్లు పాల్గొంటాయి. ఐదు రోజుల్లో క్రీడల ప్రక్రియ పూర్తిచేసి, మండల స్థాయిలో 12 రోజులు, నియోజకవర్గ స్థాయిలో ఐదు రోజులపాటు నిర్వహిస్తారు. అనంతరం ఏడు రోజుల పాటు జిల్లా స్థాయి, మరో ఐదు రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు.

20 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్..

15 సంవత్సరాలకు పైబడిన బాల,బాలికలు, మహిళలు, పురుషులు మొదలు సీనియర్ సిటిజన్స్ సైతం ఈ క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించ నున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి గ్రామ/వార్డు సచివాలయాలకు క్రీడా సామగ్రి పంపిణీ చేయనున్నారు. సచివాలయ స్థాయిలో బేసిక్, నియోజకవర్గ స్థాయిలో ప్రొఫెషనల్ క్రీడా సామగ్రి అందివ్వనున్నారు. మండల స్థాయికి ఎంపికైన వారికి టీషర్ట్, క్యాప్, రిస్ట్ బ్యాండ్, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్ అందజేయనున్నారు. క్రీడల నిర్వహణకు సీనియర్ క్రీడాకారులు, వ్యాయామోపాధ్యాయులు, శిక్షకుల సేవలు వినియోగించుకోనున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి ప్రక్రియను అధికారులు ఇప్పటికే పూర్తిచేశారు. క్రీడా సామగ్రికి సంబంధించిన మెటీరియల్ 85 శాతం మేర జిల్లాకు చేరుకోగా, మిగతా సామగ్రి మరో రెండు రోజుల్లో రానున్నట్లు శాప్ అధికారులు పేర్కొన్నారు.

జిల్లా	సచివాలయాలు	క్రీడాకారులు	మైదానాలు	క్రీడాసామగ్రి
వైఎస్‌ఆర్ కడప	645	73,530	645	21,300
అన్నమయ్య	501	57,114	501	17,249



మెగా క్రీడాటోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు



ఆడుదాం ఆంధ్రా పేరుతో నిర్వహించనున్న మెగా క్రీడా టోర్నమెంట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఈ నెల 20వ తేదీ నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించనున్నాం. సచివాలయ స్థాయిలో క్రీడల పోటీల నిర్వహణకు ఇప్పటికే వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లో మైదానాలను గుర్తించాం. 21వ తేదీ నుంచి సచివాలయాలకు స్పోర్ట్స్ మెటీరియల్‌ను పంపిణీ చేస్తాం.

– సి.సాయిగ్రేస్, సీఈఓ, స్టెప్, వైఎస్‌ఆర్ కడప/అన్నమయ్య

ఐదు క్రీడాంశాల్లో పోటీల నిర్వహణ



క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో సచివాలయ స్థాయి నుంచి ఐదు దశల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నాం. వీటితోపాటు స్థానికంగా పేరొందిన సంప్రదాయ క్రీడలను సైతం నిర్వహించుకునే వెసులుబాటు ఉంది. దీనికి సంబంధించి వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకుల సేవలు వినియోగించుకుంటాం.

– ఎస్.వి.పి.అమృత్‌రాజ్, చీఫ్ కోచ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, కడప

రాజంపేట రైల్వేస్టేషన్‌కు 157 ఏళ్లు



కేక్ కట్ చేస్తున్న గుంతకల్ రైల్వే యూజర్స్ కమిటీ సభ్యుడు తల్లెం భరత్‌రెడ్డి

రాజంపేట: పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట రైల్వేస్టేషన్ ఏర్పాటు ప్రాధాన్యతను గుర్తు చేసుకుంటూ శతాబ్దిన్నర వేడుకలను గురువారం స్టేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవిర్భావ కేక్‌ను గుంతకల్ డివిజనల్ రైల్వే యూజర్స్ కమిటీ సభ్యుడు , చిత్తూరు జిల్లా జెసీఎస్ కో–ఆర్డినేటర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట రైల్వేస్టేషన్‌ను 1866 నవంబరు 15న ఏర్పాటుచేశారన్నారు. 157 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో రైల్వేల అభివృద్ధికి లోక్‌సభ సభ్యుడు పీవీమిథున్‌రెడ్డి కృషిచేశారన్నారు. వందేళ్లుగా ఉన్న రైల్వేకోడూరు ఆర్‌యూబీ సమస్యను పరిష్కరించారన్నారు. రాజంపేట రైల్వేస్టేషన్‌కు అమృతభారత్ జాబితాలో చోటు కల్పించి, అభివృద్ధికి బీజం వేయించారన్నారు. ఈ పథకం కింద స్టేషన్‌లో ఆధునాతన సౌకర్యాలను కల్పిస్తారన్నారు. ప్లాట్‌ఫాంలో ప్రయాణికుల మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా నిర్మాణాలు చేపట్టనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఏఈఎన్ అహ్మదుల్లా, ఐవోడబ్ల్యు రమణరావు, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ త్రివేణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జయేంద్రకుమార్, ఎస్ఎంఆర్ సిన్హా తదితర రైల్వే అధికారులు, రైల్వే సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కులగణన

కలెక్టర్ గిరీషా పీఎస్ వెల్లడి



కులగణనపై సూచనలు, సలహాలు ఇస్తున్న కలెక్టర్

రాయచోటి: జిల్లాలో కులగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో వివిధ కుల సంఘాల పెద్దలు, ఎన్జీఓలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 10వ తేది వరకు కులగణన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన అధికారులందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కులగణన ద్వారా జిల్లాలో ఏయే కులాలకు చెందిన వారు ఎంతమంది ఉన్నారు, ప్రభుత్వ పథకాలు ఎవరెవరికి చేరుతున్నాయి అనే వివరాలు పక్కాగా ఉంటాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, సోషల్ వెల్ఫేర్ డీడీ జాకీర్ హుస్సేన్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం నిర్మాణ పనుల పరిశీలన

జిల్లా కేంద్రంలో శరవేగంగా రూపుదిద్దుకుంటున్న క్రికెట్ స్టేడియం క్రీడాకారుల ఉన్నతికి ఉపయోగపడేలా సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాయచోటి మండలం దిగువ అబ్బవరం గ్రామ పంచాయతీ నక్కలవాండ్లపల్లి వద్ద నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పనులకు సంబంధించి రెవెన్యూ, ఆర్ అండ్ బీ, మున్సిపల్ అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్యాలరీ ఏర్పాటుపై చర్చించారు. అనంతరం పలు సూచనలు చేశారు. వచ్చే నెల ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉన్నందున స్టేడియం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్టేడియంతో పాటు 2 టెన్నిస్ కోర్టులు, బ్యాడ్మింటన్ మరియు బాస్కెట్ బాల్ కోర్టు, రన్నింగ్, వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. స్టేడియం నిర్మిస్తున్న స్థలం సమీపంలో ఉన్న సమాధులకు రక్షణ ఏర్పాటు చేయాలని అక్కడి గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. వారి సమస్యపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

కలెక్టర్ బంగ్లా నిర్మాణ పనులు

జిల్లా కలెక్టర్ బంగ్లా నిర్మాణానికి మొదలు పెట్టిన బంగ్లా నిర్మాణ అభివృద్ధి పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఇందుకు సంబంధించి వివిధ అంశాలలో అధికారులకు తగు సూచనలు జారీ చేశారు.

ప్రగతి పథంలో రాయచోటి

- పట్టణానికే తలమానికం వైఎస్సార్ మున్సిపల్ సభాభవనం
- ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్



సభాభవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్‌లు

రాయచోటి అర్బన్: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణాన్ని సమష్టి కృషితో అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. రాయచోటి పట్టణానికే వైఎస్‌ఆర్ మున్సిపల్ సభాభవనం తలమానికంగా నిలుస్తుందని అన్నారు. రూ. 2.40 కోట్ల నిధులతో నిర్మించిన మున్సిపల్ సభాభవనం ప్రారంభోత్సవానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సభాభవనం ,మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లను శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజలతోనూ, సర్వమత ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడికోట మాట్లాడుతూ నూతన సభాభవనం నిర్మాణంతో మున్సిపల్ చరిత్రలో నేడు ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించుకుందన్నారు. బీఆర్‌జీఎస్, మున్సిపల్ సాధారణ నిధులు రూ.2.40 కోట్లతో సభా భవనంను నిర్మించుకుని వైఎస్‌ఆర్ సభాభవనంగా నామకరణం చేశామన్నారు. గ్రామపంచాయతీ బోర్డు నుంచి మున్సిపాలిటీగా అవతరించినందుకు దివంగత ఎమ్మెల్యే హబీబుల్లా మున్సిపల్ కార్యాలయం భవనంగా మున్సిపల్ కౌన్సిల్, ప్రజల కోరిక మేరకు నామకరణం చేశామని వివరించారు. పట్టణంలో జరుగుతున్న ఆర్టీసీ బస్టాండు తదితర భవనాలకు నియోజకవర్గానికి గతంలో సేవలందించిన మండిపల్లె నాగిరెడ్డి, కెప్టెన్ క్రిష్ణారెడ్డి, యర్రప్పరెడ్డి ఆదినారాయణరెడ్డి, మండిపల్లె నారాయణరెడ్డి, సుగవాసి పాలకొండ్రాయుడు లాంటి మహనీయుల పేర్లు పెట్టేందుకు కృషిచేస్తున్నామన్నారు.

అభివృద్ధికి నిదర్శనం రాయచోటి మున్సిపాలిటీ: కలెక్టర్ గిరీషా

రాయచోటి మున్సిపాలిటీ అభివృద్ధికి నిదర్శనంగా మారిందని కలెక్టర్ గిరీషా పిఎస్ అన్నారు. పట్టణంలో మౌళిక వసతులు రోజురోజుకు మెరుగుపడుతున్నాయన్నారు. రాబోయే తరాల అవసరాలకు తగ్గట్లుగా తాగునీటి వనరులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. నూతన జిల్లా కేంద్రంలో సరికొత్త అనుభూతిని పొందేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైఎస్‌ఆర్ మున్సిపల్ సభాభవనంను నిర్మించడం హర్షదాయకమన్నారు. పాలకవర్గం సమిష్టికృషితో పట్టణాభివృద్ధికి పాటుపడా లని సూచించారు.

ప్రజల కలలను సాకారం చేస్తున్న ఎమ్మెల్యే: మున్సిపల్ చైర్మన్

రాయచోటి ప్రజల కలలను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సాకారం చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష అన్నారు. జగనన్న పాలనలో కులాలు,మతాలు,పార్టీలకు అతీతంగా అర్హతే ఆధారంగా అందరికి సంక్షేమపథకాలు అందుతున్నా యన్నారు.

జయహో..

ముంబై వాంఖడే స్టేడియంలో మోగిన బ్యాటింగ్ మోతకు.. కడపలో కరతాళధ్వనులు జయజయధ్వానాలు పలికాయి. విరాట్ విశ్వరూపానికి.. షమీ విధ్వంసానికి క్రికెట్ అభిమానులు పూనకాలతో ఊగిపోయారు. వరల్డ్ కప్ సెమీ ఫైనల్ మ్యాచ్‌ను పెద్దస్క్రీన్‌పై తిలకించే అవకాశం రావడంతో యువతలో ఉత్సాహం ఉరకలెత్తింది. భారత ఆటగాళ్లు వికెట్లు తీసినప్పుడల్లా మైదానంలో టార్చ్‌లైట్ల కాంతులు మెరిశాయి.



మ్యాచ్‌ను వీక్షిస్తున్న క్రీడాభిమానులు





కడప స్పోర్ట్స్: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) మైదానం వేదికగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లైవ్ స్ట్రీమింగ్‌కు క్రీడాభిమానుల నుంచి విశేష స్పందన లభించింది. బుధవారం ప్రపంచకప్ క్రికెట్‌లో భాగంగా నిర్వహించిన భారత్, న్యూజిలాండ్ సెమీఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. దీంతో వేలసంఖ్యలో క్రీడాభిమా నులు మైదానానికి చేరుకుని సెమీ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించారు. త్రివర్ణ పతాకాలను ముఖంపై చిత్రీకరించుకోవాలనుకునే వారికోసం ప్రత్యేకంగా టాటూ సెంటర్‌లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు మ్యాచ్ ప్రారంభం కాగా.. 1 గంటల నుంచే క్రీడాభిమానులు మైదానంలో సందడి చేశారు. మ్యాచ్ ప్రారంభంలో కేరళ వాయిద్యాల నడుమ యువత కేరింతలు కొడుతూ సందడి చేశారు. విరాట్ కోహ్లీ 50 సెంచరీలు సాధించడంతో డీజేతో యువత హల్‌చల్ చేశారు. ఇక సాయంత్రం వేళ కుటుంబసభ్యులతో సైతం నగర ప్రజలు తరలిరావడంతో మైదానం కళకళలాడింది. భారత ఆటగాళ్లు రాణించినప్పుడల్లా అభిమానులు ఉత్సాహంతో ఊగిపోయారు. మ్యాచ్ ఆద్యంతం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ ప్రతినిధులు చర్యలు చేపట్టారు.

ప్రజల నుంచి విశేష స్పందన లభించింది



ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌తో లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేశాం. వేల సంఖ్యలో మ్యాచ్‌ను తిలకించేందుకు రావడం చాలా సంతోషంగా ఉంది. ఏసీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఊహించినదాని కంటే విజయవంతమైంది.

– అవ్వారు రెడ్డిప్రసాద్, క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి, కడప

సరికొత్త అనుభూతి



వేలాది మంది క్రీడాభిమానుల మధ్య లైవ్ మ్యాచ్‌ను వీక్షించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నాం. సరికొత్త రికార్డులు నమోదైన ఈ సెమీఫైనల్ మ్యాచ్‌ను వీక్షించడం సంతోషంగా ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో, సాయంసంధ్యవేళ మ్యాచ్‌ను వీక్షించడం ప్రత్యేక అనుభూతినిచ్చింది. కోహ్లీ ప్రపంచరికార్డు సృష్టించడం మరిచిపోలేనిరోజు.

– శ్రీలత, క్రీడాభిమాని, కడప

క్లుప్తంగా

మహిళపై దాడి ఘటనలో కేసు

కలకడ : మహిళపై దాడి చేసిన భార్య, భర్తపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెకు చెందిన రేవూరి.రెడ్డెప్ప భార్య సరస్వతిని ఇంటి స్థలం విషయంగా అదే గ్రామానికి చెందిన యర్రయ్యగారి.ఆనంద అతని భార్య శశికళ కలిసి దుర్భాషలాడారని, కొట్టి గాయపరిచినట్లు బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు యర్రయ్యగారి.ఆనంద, అతని భార్య శశికళ పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యకేసులో భర్త, అత్త అరెస్ట్

మదనపల్లె : కుటుంబసమస్యలతో భర్తతో గొడవపడి ఈనెల 13న పట్టణంలోని అయోధ్యనగర్‌కు చెందిన వివాహిత మౌనిక(28) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో మౌనిక తండ్రి కేశవరెడ్డి ఫిర్యాదుమేరకు దర్యాప్తు చేసిన టూటౌన్ ఎస్ఐ వెంకటేష్ నిందితులైన మౌనిక భర్త నీలకంఠారెడ్డి, అత్త కృష్ణవేణమ్మలను బుధవారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

బైక్‌ల ఢీ : వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన సుదర్శన్‌రెడ్డి

బి.కొత్తకోట : మండలంలోని శంకరాపురం వద్ద బుధవారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురుగా ఢీకొన్నాయి. ములకలచెరువు మండలం వేపూరికోట నుంచి సుదర్శన్‌రెడ్డి(21) బైక్‌లో బెంగళూరు వెళుతున్నాడు. గౌనిపల్లె వైపు నుంచి బి.కొత్తకోటకు వస్తున్న మరో బైక్ ఢీకొంది. ప్రమాదంలో సుదర్శన్ రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని 108లో స్థానిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తీసుకెళ్లారు.

ఆటో ఢీకొని..



గాయపడిన నాగరాజ

మదనపల్లె : ద్విచక్ర వాహనంలో వస్తుండగా, ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. మదనపల్లె కొత్త ఇండ్లు ప్రాంతానికి చెందిన వెంకటరమణ కుమారుడు వి.నాగరాజ(32) పెయింటర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. వ్యక్తిగత పనుల్లో భాగంగా పుంగనూరు నుంచి మదనపల్లెకు ద్విచక్రవాహనంలో వస్తుండగా, జ్యూస్‌ఫ్యాక్టరీ సమీపంలో ఆటో ఢీకొంది. ప్రమాదంలో నాగరాజు తీవ్రంగా గాయపడగా, ఆటో ఆపకుండా వెళ్లిపోయింది. గమనించిన స్థానికులు బాధితుడ్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

పుల్లంపేట : పుల్లంపేట మండలంలోని ఎస్‌బీవీడీ సభా క్రీడా మైదానంలో బుధవారం రాష్ట్రస్థాయి ఇంటర్ స్కూల్ క్రీడా పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యాయామ అధికారి భానుమూర్తి రాజు, సర్వశిక్షా అభియాన్ డైరెక్టర్ శ్రీనివాసులు, డీఈఓ పురుషోత్తం, ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు పుల్లంపేటలో నిర్వహించడం గొప్ప విషయమన్నారు. పోటీల్లో నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారన్నారు.విజేతలను అభినందించారు. బాలుర విభాగంలో మోంట్రీ స్కూల్ వారు ప్రథమ స్థానంలో నిలువగా, కెవీఎస్ వాలేరు వారు ద్వితీయస్థానంలో, కేవీఎస్ తిరుపతి వారు తృతీయస్థానం సాధించారు. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో పెంచల్ రెడ్డి పాఠశాల, కేవీఎస్ మార్కాపురం వారు ద్వితీయ స్థానం సాధించారు. అనంతరం గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చక్రాధర్ రాజు, నాగా తిరుమలరావు, ఎస్‌బీవీడీ సభా విద్యాసంస్థల కరస్పాండెంట్ శ్రీరాములు, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రకుమార్, బాలశేఖర్, నీలకంఠరావు, ఉపాధ్యాయులు, తహశీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీఓ రఘురాం, బోగా పార్థసారధి, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షతోనే ఆర్టీసీ డ్రైవరు హత్య



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కలికిరి : పాతకక్ష మనసులో పెట్టుకుని పక్కా పథకం ప్రకారం ఆర్టీసీ డ్రైవరు సాలి రవి(52)ని హత్య చేశారని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గుట్టపాళెం గ్రామం నల్లగుట్ట హరిజనవాడకు చెందిన ఎస్.రవి పీలేరు ఆర్టీసీ డిపోలో డ్రైవరుగా విధులు నిర్వహిస్తున్నాడు.సోమవారం ఉదయం యధావిధిగా డ్యూటీకి బయల్దేరాడు. అతను వెళ్లే దారిలో కాపుకాచిన గుర్తుతెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు. దారిలో రక్తపు మరకలను బుధవారం గుర్తించిన స్థానికులు మృతుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక సర్పంచ్ వెంకటరెడ్డి, కుటుంబ సభ్యులు మృతుని చెప్పుల ఆధారంగా హత్య జరిగినట్లు గుర్తించారు. రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు కదిరి రైల్వే సీఐ నాగరాజ, వాల్మీకిపురం, పీలేరు సీఐలు సురేష్, మోహన్‌రెడ్డి, కలికిరి ఎస్ఐ రహీముల్లా, రైల్వే హెచ్‌సీ మహబూబ్‌బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆనవాళ్లను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలికిరి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల సమాచారం మేరకు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. మృతుడు సౌమ్యుడు, మంచి వ్యక్తిగా గుర్తింపు ఉండటంతో స్థానికులు విచారం వ్యక్తం చేశారు. గ్రామం సమీపంలోనే హత్యకు పాల్పడ్డ గుర్తుతెలియని వ్యక్తులు ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని రైల్వే ట్రాక్‌పై పడేసి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పీటీఎం మండలం మద్దయ్యగారిపల్లెకు చెందిన సుధాకర భార్య శిరీష(26) కుటుంబసమస్యలతో ఇంట్లోనే పురుగుమందు తాగింది. అదేవిధంగా పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన చౌడప్ప భార్య ఆర్.హేమావతి(60) బుధవారం అనారోగ్య కారణాలతో విషద్రావణం తాగింది. పట్టణంలోని కొత్త ఇండ్లుకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు కే.భానుప్రకాష్(27) స్థానికంగా బార్బర్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇటీవల పలువురి వద్ద అధికసంఖ్యలో అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిడి అధికమవడంతో బుధవారం ఇంట్లోనే ఎలుకలమందు తాగాడు. ఆయా ఘటనల్లో బాధితులను కుటుంబసభ్యులు 108 అంబులెన్స్ వాహనాల్లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చదువుల బాబుకు సన్మానం



డీకే చదువులబాబును సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ ఉషారాణి

ప్రొద్దుటూరు : నిరంతర కృషితోనే డీకే చదువుల బాబుకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి తెలిపారు. స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో బుధవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డీకే చదువుల బాబును సత్కరించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచి ప్రముఖులను ఆదర్శంగా తీసుకుని లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని తెలిపారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, కడప గ్రంథాలయాధికారి అమీరుద్దీన్, గ్రంథాలయాధికారిణి తిరుపతమ్మ, చంద్రశేఖర్, కొండయ్య, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉషారాణి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న గ్రంథాలయాన్ని పరిశీలించారు.

విద్యుత్ స్తంభం విరిగి కార్మికుడికి గాయాలు



గాయపడిన ఖాదరూన్

మదనపల్లె : రోడ్డు రిపేరీలో భాగంగా విద్యుత్ స్తంభాలకు కనెక్షన్ ఇస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం విరిగి పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. పశ్చిమ బెంగాల్ మాండ్లా పట్టణానికి చెందిన ఖాదరూన్(26) మరో 15మందితో కలిసి అంగళ్లు-మదనపల్లె రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్ల రిపేరీలకు వచ్చారు. బుధవారం విశ్వంకాలేజీ సమీపంలో పనుల్లో భాగంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు స్తంభం ఎక్కిన ఖాదరూన్ ఒక్కసారిగా స్తంభం విరిగిపోవడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. సహచరులు వెంటనే 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రక్తపోటు తగ్గి విద్యార్థి మృతి



వివేక్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

బి.కొత్తకోట : మండలంలోని కంబాలపల్లెలో ఏడోతరగతి విద్యార్థి ధనుష్ మృతి మరువకముందే బుధవారం తెల్లవారుజాము పదోతరగతి విద్యార్థి మృతి ఆకులవారిపల్లెలో విషాదం మిగిల్చింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. నాయనబావి పంచాయతీ ఆకులవారిపల్లెకు చెందిన బి.బాలకృష్ణారెడ్డి, ఈశ్వరమ్మల కుమారుడు బి.వివేక్‌రెడ్డి(18) మదనపల్లెలోని ప్రైవేట్ హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్నాడు. మంగళవారం వివేక్ వాంతి చేసుకుని నీరసంగా ఉండటంతో మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఎలాంటి ఇబ్బంది లేదని, ఆరోగ్యం బాగుందని వైద్యులు చెప్పడంతో ఇంటికి తీసుకెళ్లారు. ఇంటికి వచ్చిన అరగంటకే శరీరం చల్లబడటంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు గుండె సంబంధిత సమస్య ఉందని, సంబంధిత డాక్టర్ వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. మదనపల్లెలో ఓ గుండె వైద్యుని పుణుడి వద్దకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు రక్తపోటు తగ్గిపోయిందని గుర్తించి కుటుంబీకులకు చెప్పారు. కుటుంబీకులు తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లి వైద్యం చేయిస్తుండగా బుధవారం తెల్లవారుజాము వివేక్ మృతిచెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కుటుంబీకుల, గ్రామస్తుల కన్నీళ్ల మధ్య అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా బాలకృష్ణారెడ్డి, ఈశ్వరమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. వీరిలో కుమార్తె 2011లో జన్మించి 2014లో మృతిచెందింది. ఇప్పుడు కుమారుడు చనిపోవడంతో పుట్టిన సంతానం దూరమైంది. ఈ విషయం తలచుకుని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో బాలుడు మృతి



మృతి చెందిన జోహిత్‌రెడ్డి

రామసముద్రం : రామసముద్రం మండలం మూగవాడి పంచాయతీ గుండ్లపల్లి గ్రామానికి చెందిన మంజునాథ్‌రెడ్డి, నందినికి చెందిన 10 నెలల కుమారుడు జోహిత్‌రెడ్డి బుధవారం అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. తల్లిదండ్రుల కథనం మేరకు ఉదయం 10 గంటల్లో ఏఎన్ఎం వ్యాక్సిన్ వేసి మాత్రలు ఇవ్వమని జాగ్రత్తలు సూచించి వెళ్లిందన్నారు. వ్యాక్సిన్ వేశాక బాలుడు నిద్రపోయాడని అయితే మధ్యాహ్నం 2 గంటలైన నిద్ర లేవకపోవడంతో గమనించిన కుటుంబీకులు అపస్మారక స్థితిలో ఉన్న బిడ్డను తీసుకుని పుంగనూరు ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. కళ్ల ముందర చిన్నారి బాలుడు మృతి చెందడంతో తల్లడిల్లిపోయిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బోరున విలపించారు. ఈ విషయమై రామసముద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలను వివరణ అడగ్గా అదే వ్యాక్సిన్ రామసముద్రంలో 8 మందికి వేశామని, వారికి ఎలాంటి ఇబ్బంది జరగలేదన్నారు. మృతి చెందిన బాలుడికి ఏం జరిగిందనేది తెలియలేదని తల్లిదండ్రులను, తమ సిబ్బందిని విచారించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, కన్వీనర్ నంద, వేణుగోపాల్‌రెడ్డిలు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్వాతంత్య్ర సమరయోధుల త్యాగం మరువలేనిది



మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి అబ్బులాం

రాయచోటి అర్బన్ : గిరిజనుల హక్కులు ,స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్‌వారిపై పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగం మరువలేనిదని జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి అబ్బులాం అన్నారు. బుధవారం రాయచోటిలో జనజాతీయ గౌరవ దివస్ (గిరిజన స్వాభిమాన ఉత్సవాలు -2023) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన పోరాట యోధుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని జనజాతీయ గౌరవదివస్‌ను నిర్వహించడం ఆనందదాయకం అన్నారు. బిర్సాముండా 22 సంవత్సరాల వయస్సులోనే బ్రిటిష్‌వారిపై పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్రప్రధాన కార్యదర్శి విశ్వనాథనాయక్, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ నిజామాబాద్ సెంట్రల్‌బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్‌పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్, లంబాడి హక్కుల సంఘం నేత శంకర్‌నాయక్, ఎరుకల హక్కుల పోరాటసమితి నేతలు నక్కా నారాయణ, రమణ, బంజారా నేతలు అమరేంద్ర నాయక్, బిల్లునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోసామనోహర్

ప్రొద్దుటూరు క్రైం : బెనర్జీపై జరిగిన హత్యాప్రయత్నం కేసులో సెంట్రల్ జైల్లో ఉన్న ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని పోలీసులు కస్టడీలోకి తీసుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్ డిమాండు చేశారు. బెనర్జీపై హత్యాప్రయత్నం చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండు చేస్తూ బుధవారం శివాలయం సెంటర్ నుంచి మైదుకూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోసా మనోహర్ మాట్లాడుతూ దళిత యువకుడు బెనర్జీపై తన తమ్ముళ్లు భరత్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు దాడి చేశారని ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సమర్థించుకోవడం శోచనీయమన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కుటుంబం గురించి ప్రవీణ్ మాట్లాడటం హుందాతనం అనిపించుకోదన్నారు. తనను నమ్ముకొని ఉన్న దళిత యువకుడిపై దాడి జరగ్గా సహృదయంతో ఎమ్మెల్యే రాచమల్లు మెరుగైన చికిత్స చేయించేందుకు బెనర్జీని హైదరాబాద్‌కు పంపించారన్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.20 లక్షలు ఖర్చు పెట్టారన్నారు. ఒక దళిత యువకుడి ప్రాణాలను కాపాడిన ఎమ్మెల్యే క్యారెక్టర్ ఎక్కడ.. దాడిని సమర్థించిన ప్రవీణ్ మనస్తత్వం ఏంటో ప్రజలు గమనించాలన్నారు. బెనర్జీపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రొద్దుటూరులో మూడు హత్యలు జరుగుతాయని గతంలో ప్రవీణ్ చెప్పారన్నారు. అందులో భాగంగానే బెనర్జీపై హత్యాప్రయత్నం జరిగిందన్నారు. మిగతా రెండు హత్యల గురించి ప్రవీణ్ సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న భరత్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. మాలమహానాడు స్టేట్ కన్వీనర్ చింతకుంట దానమ్మ మాట్లాడుతూ బెనర్జీపై హత్యాప్రయత్నం చేసిన ఘటనలో తన పాత్ర లేకుంటే ప్రవీణ్‌కుమార్‌రెడ్డి 16 రోజులుగా ఎందుకు పరారీలో ఉన్నాడన్నారు. దళితుల్లా ఎవరైనా పుడతారా అని హేళన చేసిన చంద్రబాబునాయుడు అడుగు జాడల్లోనే టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్ రెడ్డి నడుస్తున్నాడని ఆమె తెలిపారు.

విద్యార్థి సంపూర్ణ వికాసానికి పాఠ్యపుస్తకాలు దోహదం



మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రతి విద్యార్థి సంపూర్ణ వికాసానికి పాఠ్యపుస్తకాలు దోహదం చేస్తాయని రాష్ట్ర ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ముద్రణాలయం సంచాలకులు రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విద్యార్థుల వద్ద ఉన్న టెక్స్ట్‌బుక్, వర్క్‌బుక్‌లను పరిశీలించారు. వివిధ రకాల టైటిల్స్, వాటి పేర్లను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అనంతరం ఎన్‌సీఈఆర్‌టీ - ఎస్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల మధ్య తేడాలను అడిగి తెలుసుకుని ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల ప్రాధాన్యతను వివరించారు. అలాగే పాఠ్యపుస్తకాల పంపిణీ విషయంపై ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష పథక సీఎంఓ కొండా దశరథరామిరెడ్డి, ప్రభుత్వ పాఠ్యపుస్తకాల జిల్లా డిపో మేనేజర్ రామాంజనాదేవి, డేవిడ్, ఎంఈఓ ప్రమీలదేవి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కరీముల్లా, ఉపాధ్యాయులు సి.రామచంద్రారెడ్డి, పెసలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సు కార్డుల జారీ వేగవంతం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దాదాపు 2021 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సు కార్డుల జారీకి మోక్షం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం వాహనదారులకు ఆర్సీ, డ్రైవింగ్ కార్డులను అందజేసేందుకు చర్యలు చేపట్టడంతో రవాణాశాఖ అధికారులు వాటిని ప్రింటింగ్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 2021 సెప్టెంబర్ నుంచి 2023 ఆగస్టు వరకు దాదాపు 54,119 డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే వాహనాల ఆర్సీ కార్డులు 2021 నవంబర్ నుంచి 2023 ఆగస్టు వరకు దాదాపు 47972 పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం 1,02,091 కార్డులు పెండింగ్‌లో ఉండటంతో వాటిని ప్రింటింగ్ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. వీటిని స్పీడ్ పోస్టు ద్వారా వేగంగా వాహనదారులకు అందజేసేందుకు కృషి చేస్తున్నారు. డీటీసీ మీరా ప్రసాద్ కార్డుల ప్రింటింగ్ తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులకు తగిన సలహాలు, సూచనలను అందజేస్తున్నారు. ఏ రోజు కార్డుల ప్రింటింగ్ జరిగిందో అదే రోజు వాహనదారులకు స్పీడ్ పోస్టు ద్వారా పంపిస్తున్నారు.

వాహనాదారుల్లో ఆనందం

చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఆర్సీ, డ్రైవింగ్ కార్డులు ప్రింటింగ్ పూర్తి చేసుకుని వాహనదారులకు అందతుడటంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న కార్డులు తమ చేతికి రావడంతో వారు ఊపిరి పీల్చుకుంటున్నారు.

పెండింగ్ కార్డులను వాహనదారులకు అందజేస్తాం

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 1,02,091 ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ కార్డులను ప్రింటింగ్ చేసి వాహనదారులకు ఈనెలాఖరులోగా అందజేస్తాం. మిగిలిన కార్డులు కూడా వీలైనంత త్వరగా అందేలా చర్యలు చేపడతాం. – ఈ. మీరా ప్రసాద్, జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్

వాహనంలో మంటలు

– రూ. 15 లక్షల నష్టం



కాలిపోతున్న ఐషర్ వాహనం

కురబలకోట : కురబలకోట మండలం అంగళ్లలోని టి. అనితకు చెందిన ఐషర్ వాహనం నాగ్ పూర్- హైదరాబాదు హైవేపై బుధవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. డ్రైవర్ రెడ్డి శేఖర్ కథనం మేరకు...జబల్ పూర్ నుంచి హైదరాబాదుకు వేస్ట్ పేపర్‌లోడు వేసుకుని వార్ధా జిల్లాలో హైవేపై వస్తుండగా బండి నుంచి వాసన రాసాగింది. డ్రైవర్ గమనించి దిగి చూడగా కేబిన్‌కు, తలుపు భాగం మధ్యలో పొగలు రాసాగాయి. రగులుతున్న మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తుండగా గాలికి టార్పాలిన్ అంటుకుని లోడులోని పేపర్ అంటుకుంది. చూస్తుండగానే ఐషర్ వాహనం కాలిపోయింది. ఫైరింజన్ వచ్చినప్పటికీ అప్పటికే చాలా భాగం లోడుతో సహా వాహనం కాలిపోయినట్లు డ్రైవర్ తెలిపారు. ఈ ప్రమాదంలో రూ. 15 లక్షల దాకా నష్టం సంభవించినట్లు బాధితులు వాపోతున్నారు.

పైపుల చోరీ కేసులో నిందితుడికి జైలు



నిందితుడు కదం సురేష్

రాజంపేట రూరల్ : ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని పెట్రోల్ బంక్‌లో పైప్‌లను దొంగలించిన నిందితుడు కదం సురేష్‌కు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు. పట్టణ ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి బుధవారం వివరాలు వెల్లడించారు. 2023 ఏప్రిల్ 19వ తేదీన చోరీ జరిగినట్లు ఐఓసీకి చెందిన వారు ఫిర్యాదు చేశారు. నేడు సీఐగా విధులు నిర్వహిస్తున్న అప్పటి ఎస్ఐ పీ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 2023 ఏప్రిల్ 20న సురేష్‌ను అరెస్టు చేసి పైప్‌లను రికవరీ చేశారు. అనంతరం రిమాండ్‌కు పంపారు. మొదటి తరగతి జుడీషియల్ కోర్టు ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ లత సదరు కేసుపై ట్రయల్ జరిపారు.నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు. కేసు దర్యాప్తు చేసిన అప్పటి ఎస్ఐ పీ వెంకటేశ్వర్లు, కోర్టులో వాదించిన ఏపీపీ రెహనా రసూల్, కోర్టు కానిస్టేబుల్ మణిరత్నంను డీఎస్పీ చైతన్య, సీఐ నరసింహరావు అభినందించారు.

బంగారు నగలు చోరీ

పెద్దమండ్యం : మండలంలోని కలిచెర్లలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు నగలు చోరీ చేశారు. ఎస్ఐ రామాంజనేయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలిచెర్లకు చెందిన సయ్యద్ గౌస్ భార్య సయ్యద్ షహజారిన్ దీపావళి పండుగకు చిన్నమండ్యం మండలంలోని బోనుమలకు వెళ్లింది. మూడు రోజుల పాటు అక్కడే ఉండి గురువారం ఇంటికి వచ్చింది. అయితే ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గుర్తించింది. స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. చోరీ జరిగిన ఇంటిని ఎస్ఐ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు 44 గ్రాముల బంగారం చోరీ అయినట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ తూపల్లె పరిసర ప్రాంతాల్లోని వాగులు, వంకల్లో బుధవారం అదే గ్రామానికి చెందిన వసంత ఆంజనేయులు (ఏపీ 39 వీఆర్ 2928) ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మండల ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

కాల్వలో పడి కార్మికుడి మృతి



విజయ్‌రాజ్ (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు విజయ్‌రాజ్ బుధవారం పట్టణ పరిధిలోని ఉత్తరకాల్వలో జారి పడి మృతి చెందాడు. ఎస్ఐ సుబ్బారావు కథనం మేరకు విజయ్‌రాజ్ జమ్మలమడుగు మున్సిపాలిటీలో పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని ఇంటికి వెళుతూ ముఖం కడుక్కోవడానికి ఉత్తరకాల్వలో దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు స్థానికుల సహాయంతో బయటకు తీశారు. అయితే అప్పటికి విజయ్‌రాజ్ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో ఈనెల 13న అనారోగ్యంతో చేరిన గుర్తు తెలియని మహిళ (50) బుధవారం మృతి చెందింది. ఆమె ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని కడప రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

రేపటి నుంచి రాష్ట్ర మహా సభలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 15 మహాసభలు ఈ 17 నుంచి 19 వరకు నంద్యాలలో జరుగుతున్నాయని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య కడప నగర కార్యదర్శి వడ్ల భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక సమాఖ్య కార్యాలయంలో మీడియా సమావేశంలో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళా సంక్షేమమే ధ్యేయంగా, అభివృద్ధే లక్ష్యంగా ఏపీ మహిళా సమాఖ్య పోరాడుతున్నదన్నారు. ఎన్నికలు జరుగనున్న తరుణంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. మహాసభల్లో భాగంగా నంద్యాల పట్టణంలో ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని, ఈ కార్యక్రమాల్లో మహిళా సమాఖ్య అగ్రనేతలు, వామపక్ష నేతలు పాల్గొంటారన్నారు.